నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

మున్సిపల్ కమిషనర్‌ను పరామర్శించిన చైర్మన్

నవతెలంగాణ-నిర్మల్

మున్సిపల్ కమిషనర్ సివిఎస్ రాజు కుమారుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లిటిల్ స్టార్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఐసియులో చికిత్స పొందుతున్న కమిషనర్ కుమారుడిని, కమిషనర్‌ను పరామర్శించారు. కమిషనర్‌తో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించినట్టు సమయానికి మెడిసిన్ ఇస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ తౌహీద్ ఉద్దీన్ రఫ్ఫూ, రాజు ఉన్నారు.



నేడు జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.45 గంటలకు ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి హైలెవెల్ బ్రిడ్జి సందర్శించి 10.40 గంటలకు వడాయిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి తల్లిదండ్రులతో మాట్లాడుతారని తెలిపారు. 11.55 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 3.15 గంటలకు వాంకిడి మండలం సవాతి గ్రామపంచాయతీ ప్రజలతో చర్చిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

చేతులెత్తేసిన మరో వ్యాపారి

- లబోదిబోమంటున్న బాధితులు
- ముందే హెచ్చరించిన 'నవతెలంగాణ'

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ఆర్థిక నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రముఖ వ్యాపారులుగా చలామణి అవుతూ రూ.కోట్లలో అప్పులు చేయడం, తర్వాత పలాయనం చిత్తగించడంతో అప్పులిచ్చిన వారు లబోదిబోమంటున్నారు. దీనిపై ఈ నెల ఏడో తేదీన నవతెలంగాణలో 'అప్పులు తీసుకుంటుండ్రు...చేతులు లేపేస్తుండ్రు..!' అనే శీర్షిక పేరుతో వార్తా కథనాన్ని ప్రచురించింది. ఇప్పటికే ముగ్గురు వ్యాపారులు కోట్లలో అప్పులు చేసి చేతులు ఎత్తేశారని, త్వరలోనే మరికొంత మంది ఇదే బాటలో పయనిస్తున్నారని వచ్చిన వార్తా కథనం కాగజ్‌నగర్‌లో చర్చనీయాంశమైంది. దీన్ని నిజం చేస్తూ స్థానిక రాజీవ్‌చౌక్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఉన్న ఒక బ్యాంక్ సర్వీసు సెంటర్ నిర్వాహకుడు సోమవారం కొంతమంది డిపాజిట్‌దారుల డబ్బులను తీసుకొని ఆయా ఖాతాలలో జమ చేయకుండా చేతులు ఎత్తేశాడు. ఈ పంచాయతీ పోలీస్‌స్టేషన్ వరకు చేరుకుంది. బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ చేయాలని సర్వీసు సెంటర్ నిర్వాహకునికి పలువురు డబ్బులు ఇచ్చి వెళ్లిపోయారు. రెండు రోజులు గడిచినా ఆయా ఖాతాలలో డబ్బులు జమ కాకపోవడంతో వారు సోమవారం వచ్చి సర్వీసు సెంటర్ నిర్వాహకున్ని నిలదీశారు. దీంతో సదరు నిర్వాహకుడు తన వద్ద ప్రస్తుతం డబ్బులు లేవని చేతులెత్తేయడంతో వారు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. సదరు నిర్వాహకుని నుండి తమకు డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. కాని డబ్బులిప్పించే బాధ్యత తమది కాదని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి చెప్పినట్లు తెలిసింది.



బ్యాంక్ సర్వీసు సెంటర్‌లో విచారణ జరుపుతున్న పోలీసులు

సర్వీసు సెంటర్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకునేదెవరు..?

వారం రోజుల క్రితం ఇదే రీతిలో ఒక బ్యాంక్ సర్వీసు సెంటర్ నిర్వాహకుడు చేతులెత్తేశాడు. ప్రస్తుతం మరో సర్వీసు సెంటర్ నిర్వాహకుడు ఇదే రీతిలో చేతులెత్తేయడంతో బ్యాంక్ ఖాతాదారులు అయోమయంలో పడుతున్నారు. జాతీయ బ్యాంక్‌ల సర్వీసు సెంటర్‌లు కావడంతో ఖాతాదారులు సాధారణంగా వాటి నిర్వాహకులను నమ్మి రూ.వేలు, లక్షలలో డబ్బులు వారికి ఇచ్చి డిపాజిట్ చేయమంటారు. కాని వీరి నమ్మకాన్ని సర్వీసు సెంటర్‌ల నిర్వాహకులు వమ్ము చేస్తూ ఆ డబ్బులను సొంతానికి వాడుకుంటున్నారు. ఆయా బ్యాంక్‌ల యాజమాన్యాలు సర్వీసు సెంటర్‌లకు అనుమతిచ్చే సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని బ్యాంక్‌లు ఆ జాగ్రత్తలు తీసుకున్నా నిర్వాహకులు వాటన్నింటిని తుంగలో తొక్కి అవకతవకలకు పాల్పడుతూ అమాయక ప్రజల డబ్బులను కాజేస్తున్నారు.

జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- అదనపు ఎస్పీకి జర్నలిస్టుల ఫిర్యాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జర్నలిస్టులకు ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ లేకుండా పోతోంది. జర్నలిస్టులపై ఇటీవలి కాలంలో కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం లాంటివి జరుగుతున్నాయి. ఇందులో పోలీసుల జోక్యం ఎక్కువగా కనబడుతోంది. ఇటీవల నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలో ఓ రిపోర్టర్ రాసిన వార్త కథనంపై చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన ఘటన మరవకముందే తాజాగా ప్రముఖ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్ ఇచ్చిన కథనంపై అధికార పార్టీ నాయకులు ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసే ప్రయత్నంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. ఇందులో పోలీసులు జోక్యం చేసుకొని నేరుగా జర్నలిస్టు ఇంటికి వచ్చి దురుసుగా ప్రవర్తించారని మంగళవారం ఆదిలాబాద్ జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసుపై చర్యలు తీసుకోవాలని, వార్తల విషయంలో పోలీసులు అతిగా జోక్యం చేసుకోకుండా చూడాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్ దేవేందర్, కో కన్వీనర్ వెంకటేష్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేటి నుండి పాఠశాలలు పున:ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. దీని కోసం మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు రెండు నెలల పాటు విద్యార్థులు లేక అపరిశుభ్రంగా మారిన స్కూళ్లను శుభ్రం చేశారు. ఇదిలా ఉంటే నూతన ప్రభుత్వం పాఠశాలల పని వేళల్లో మార్పులు చేసింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఐదు నిమిషాల పాటు యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహించాలని సూచించింది. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. ఇక రెండు నెలల వేసవి సెలవుల అనంతరం స్కూల్ గంట మోగనుంది. విద్యార్థులు బ్యాగులు ధరించి పాఠశాలలకు పరుగులు పెట్టనున్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యు) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో గల బస్సు డిపో ముందు ధర్నా చేశారు. డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ప్రగతిశీల మహిళా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఎక్కువ ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో కిక్కిరిసిపోతున్నాయని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, చంటిపిల్ల తల్లులు, పురుషులకు సీట్లు దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో సీట్ల కోసం కొట్టుకునే పరిస్థితి ఉందని, చివరికి ఆర్టీసీ ఉద్యోగులపై సైతం అసభ్యకరమైన మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి ముందు రోజుకు సగటున 45 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తే ఇప్పుడు సగటున 55 లక్షల మంది ప్రయాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సులతో పాటు కొత్త ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగామణి, లక్ష్మి కవిత, విజయ, వసంత, తైసిన్ పాల్గొన్నారు.

రైతులందరూ సాంప్రదాయ పంటలు సాగు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులందరూ సంప్రదాయ పంటలు సాగుచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో సాంప్రదాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాంప్రదాయ పంటలను సాగు చేసి లాభలు పొందాలని సూచించారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వాడకం వలన అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడకం వలన భూసారం తగ్గి భవిష్యత్తు తరాలు నష్టపోతాయని తెలిపారు. అంతకుముందు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి రైతులందరికీ వ్యవసాయంపై, సాంప్రదాయ పంటలకు ఉపయోగించవలసిన నూతన పద్ధతులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం క్రమంగా తగ్గించి, రైతులు సహజ ఎరువుల వైపునకు మళ్లాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సాంప్రదాయ పంటల సాగు, దిగుబడులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం రైతువేదికలలో పత్తి, సోయా, మొక్కజొన్న ఇతర పప్పు దినుసుల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాలలో మహిళా రైతులు పాల్గొనేలా ప్రోత్సాహించాలని సూచించారు. రైతులు గోవింద్‌రెడ్డి, భీంరావు, నారాయణరెడ్డి సాంప్రదాయ పంటల సాగుపై వారి అభిప్రాయాలు తెలియజేశారు. అనంతరం గ్రామ పల్లె ప్రకృతి వనం, నర్సరీని కలెక్టర్ సందర్శించి పెంచుతున్న మొక్కల రకాలు, సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ సర్వేను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టి ఇంటి యజమానుల నుంచి మిషన్ భగీరథ నీటికి సంబంధించిన వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ తర్వాత డంపింగ్ యార్డ్‌ను సందర్శించి ప్రతి ఇంటినుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్మి కంపోస్టు ఎరువుల తయారు పరిశీలించి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, రైతులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు నేస్తం' ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సేవలు



నవతెలంగాణ-ఇచ్చోడ

రైతు నేస్తం ద్వారా రైతులకు వీడియోకాన్ఫరెన్స్ సేవలు అందజేస్తామని కలెక్టర్ రాజార్షి షా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు నేస్తం ద్వారా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. తెలంగాణలో రైతు నేస్తం ద్వారా అన్నదాతలకు వీడియోకాన్ఫరెన్స్ డిజిటల్ సేవలు అందించేందుకు వీలుగా రైతునేస్తం కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చలు జరుపుకొని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గ్రామాల నుండే రైతులు ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవడం, తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం వల్ల తెలియని విషయాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పుల్లయ్య, డిసిఓ మోహన్, డిఈఓలు, ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఎరువులు, విత్తనాల గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బీర్సాముండా ఆశయ సాధనకు ఆదివాసులు పాటుపడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీర్సాముండా ఆశయ సాధనకు ఆదివాసులు పాటుపడాలని హీరాసుఖ జాగృతి ప్రధాన్ సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. మంగళవారం బీర్సాముండా 124వ వర్ధంతిని సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ సమీపంలోని బీర్సాముండా విగ్రహానికి పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హీరాసుఖ జాగృతి ప్రధాన్ సమితి అధ్యక్షుడు రాంకిషన్ మాట్లాడుతూ గతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రూ.కోటితో బీర్సా ముండా భవనంతో పాటు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా ప్రతి ఆదివాసీ గూడేంలో బీర్సాముండా జీవిత చరిత్రను తెలియజేస్తామని ప్రకటించారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. ఆదివాసుల కోసం ఉద్యమించిన యోధుడు బీర్సా ముండాను ఆదర్శంగా తీసుకుంటు ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు మేస్రం కృష్ణ, గేడం మహదేవ్, డొంగ్రే మహేష్, గేడం సంభాజి, కుడ్మెత ప్రకాష్, దుర్వ ప్రదీప్, జనార్ధన్ పాల్గొన్నారు.

గిరిజనులకు నాణ్యమైన విద్యా, వైద్యం అందిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం కెబి కాంప్లెక్స్ పీఎంఆర్‌సీ భవనంలో ఉమ్మడి జిల్లా గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఉచిత నాణ్యమైన ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసి విద్య వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. మారుమూల గ్రామంలో వైద్య సదుపాయాలు అందించే విధంగా ప్రతి గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం, అవ్వల్ అంబులెన్స్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అటవీ హక్కు పత్రాల సమస్యలను పరిష్కరిస్తామని, సాగు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, గిరి వికాసంలో మంజూరైన బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపిఓ(పీవీటీజీ) కుడ్మెత మనోహర్, ఈఈ రాథోడ్ భీంరావ్, జిసిసి డిఎం రామానంద, ఏఓ రాంబాబు, ఎసిఎండి జగన్, సార్‌మెడీలు మెస్రం దుర్గు పటేల్, కుర్సెంగ మోతీరామ్ పాల్గొన్నారు.

కోలిండియా ఉద్యోగుల ఓపీడీ ఫీజుల పెంపు

నవతెలంగాణ-జైపూర్

కోలిండియా ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన వారికి యాజమాన్యం తీపి కబురు అందించింది. వారి వైద్య సేవల కన్సల్‌టేషన్ ఫీజును రూ.350 నుండి రూ.1200 పెంచింది. అవుట్ పేషెంట్ ట్రీట్‌మెంట్ కొరకు ఆసుపత్రులకు వెళ్లిన ఉద్యోగుల వైద్యుల కన్సల్‌టేషన్ ఫీజు విషయమై మే 10న సమావేశమై అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్(ఓపీడీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సవరించిన కన్సల్టేషన్ ఫీజు ప్రకారం ప్రతి కన్సల్టేషన్‌కు రూ.1200 రీయింబర్స్‌మెంట్ లేదా కన్సల్టేషన్ అసలు ఫీజు ఏది తక్కువైతే అది అనుమతించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. కన్సల్టేషన్ రుసుము రశీదును రూపొందించినప్పుడు సవరించిన మొత్తం మెడికల్ అటెండెన్స్ రూల్(ఎంఏఆర్) ప్రకారం తిరిగి చెల్లించడానికి కోలిండియా యాజమాన్యం సమావేశంలో నిర్ణయించింది. ఈ సవరణ కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం ఎగ్జిక్యూటీవ్, నాన్ ఎగ్జిక్యూటీవ్‌లకు కూడా వర్తింపజేస్తూ సమావేశంలో తీర్మాణించినట్లు తెలుస్తోంది. అయితే సింగరేణి ఉద్యోగులుగా పదవీ విరమణ పొంది అతి తక్కువ పింఛన్‌తో కాలం వెళ్లదీస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వైద్యుల కన్సల్టేషన్ ఫీజు భారం పడకుండా యాజమాన్యం పూర్తిగా ఉచితం చేయాలని రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులు కోరుతున్నారు. కోలిండియా పరిధిలో అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ వైద్యుల కన్సల్టేషన్ ఫీజు రూ.350 నుండి రూ.1200కు పెంచినప్పటికీ మెడికల్ కార్డులో మినహాయింపు ఉంటున్నందున సింగరేణిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు యాజమాన్యం పూర్తి ఉచితం చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుమాధవ్ కోరారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం(సీపీఆర్ఎంఎస్(ఈ) సీపీఆర్ఎంఎస్(ఎన్ఈ) ద్వారా పొందిన రూ.8లక్షల హెల్త్ కార్డులో వైద్యుల కన్సల్టేషన్ ఫీజు మినహాయించడాన్ని సింగరేణి యాజమాన్యం పున:పరిశీలన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గండ్రత్ రమేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భీంసరి గ్రామంలో చేసిన ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించడంపై పంచాయతీరాజ్ జేఈ సలాఉద్దీన్‌ను ఎంపీటీసీ బిక్కి గంగాధర్ ప్రశ్నించారు. పనులు సక్రమంగా జరగనప్పుడు ఎలా రికార్డు చేస్తారని పేర్కొన్నారు. దీనికి జేఈ తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సమావేశం సజావుగా సాగింది. అన్ని శాఖల అధికారులు వారి వారి నివేదికలు చదివి వినిపించారు. కొన్ని శాఖలు హాజరు కాకపోవడంతో వచ్చే సమావేశానికి అన్ని శాఖలు హాజరు కావాలని, లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో వెంకటరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని జెకెనగర్‌లో వోల్టేజ్ సమస్య ఉండటంతో సోమవారం అర్ధరాత్రి వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్యతో బోరు మోటర్లు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు పనిచేయడం లేదని, కాలనీవాసులు ఇబ్బందుల దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యను తెలుసుకుని పరిష్కరించిన మున్సిపల్ చైర్మన్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-నిర్మల్



బస్సు సౌకర్యం లేని జిల్లాలోని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డిని కలిసి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేయాలని అన్నారు. స్పందించిన డిపో మేనేజర్ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏంబరి గంగాధర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

నల్ల బ్యాడ్జీలతో ఏఈఓల నిరసన

నవతెలంగాణ-లోకేశ్వరం



మహబూబాబాద్‌లో ముగ్గురు ఏఈఓలను అకారణంగా సస్పెండ్ చేసినందుకు మంగళవారం నిర్మల్ జిల్లా ముధోల్ డివిజన్ ఏఈఓలు లోకేశ్వరం రైతువేదికలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీఏఈఓ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ సస్పెన్షన్‌పై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఓలపై ఉన్న సస్పెన్షన్ని వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, పవన్ ప్రసాద్, విలాస్, ఉమేష్, మోరె మౌనిక, కుంట మౌనిక పాల్గొన్నారు.

కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో ఎంపిక చేయబడిన పేరొందిన ప్రయివేట్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా నిర్వహించారు. 1వ తరగతి, 5వ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా 1వ తరగతిలో 16 బాలికలను, (31) మంది బాలురను మొత్తం (47) మందికి అలాగే 5వ తరగతిలో (15) మంది బాలికలను, (30) మంది బాలురను మొత్తం (45) మందిని లక్కీ డ్రాలో ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీఓ సునీత, ఈడీ శంకర్, ఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలల కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని డొంగర్‌గావ్‌కు చెందిన భార్యభర్తలు ఆనక సంతోష్, స్వప్నలు పిడుగు పాటుకు మరణించిన విషయం పాఠకులకు విదితమే. సమాచారాన్ని అందుకున్న తుడుం దెబ్బ నాయకులు ఆ గ్రామాన్ని సందర్శించి, తమ వంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ. 1.13లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తుడుం దెబ్బ, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ శాఖ కార్యాలయంలో ప్రజావాణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఎస్‌ఈ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఈ జేఆర్ చావాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు కురిసిన అకాల వర్షాల కారణంగా శాఖకు భారీ నష్టం కలిగిందని, దీంతో అక్కడక్కడ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్ కూడా సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. 24 గంటలు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఉట్నూర్‌లో ఆగస్టు 2024 విద్యా సంవత్సరానికి ప్రవేశం కొరకు ఐటీఐ.తెలంగాణ.గావ్.ఇన్ ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కే.రమేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 10 నుంచి జూన్ 14 వరకు ఆన్‌లైన్‌లో అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఎ.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పలు శాఖల పనితీరుపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల నాయకులు, అధికారులు, అందరూ హాజరు కావాలని తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారంపై కౌన్సిలర్లు దృష్టిసారించాలని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం సూచించారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కారింగుల సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, అఫ్రీన్, కిషోర్ నాయక్, అబ్దుల్ ఖలీల్, తొంటి శ్రీనివాస్, ఫౌజియా బేగం, కమీషనర్ మనోహర్ పాల్గొన్నారు.

విత్తనాలు విత్తే పనిలో రైతులు

- వర్షం కోసం నిరీక్షణ...

నవతెలంగాణ-నార్నూర్



రైతులు ఉగాది పురస్కరించుకొని, వ్యవసాయ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతారు. ఉగాది నుంచి ఇప్పటి వరకు నేలను చదును చేసి, చెత్తను తొలగించి విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. గత వారం రోజులుగా జిల్లాలో అక్కడక్కడ చెదుమదురు జల్లులు కురిసినప్పటికీ అవి పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తేందుకు అనుకూలంగా లేకపోవడంతో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడక్కడ కురిసిన చిరు జల్లులకు ఎర్రనేలలు దుక్కులు దున్నుకుంటున్నారు. విత్తనాలు ఏయే సమయాల్లో విత్తుకోవాలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. అదేవిధంగా రైతులు పంటలు పండించడంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు కొందరు పత్తి విత్తనాలు, విత్తుకున్నారు. వర్షాధారం పంటలు పండించే రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు. వర్షం వస్తేనే విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు.

వర్ష ప్రభావం చూసి విత్తనాలు విత్తుకోవాలి

ఆర్.రాజేశ్వర్, ఏఈఓ నార్నూర్



రైతులు ఖరీఫ్ పంటలు వర్ష ప్రభావాన్ని చూసి విత్తనాలు విత్తుకోవాలి. విత్తనాలు విత్తుకోవడానికి ఇంకా సమయం ఉంది. వర్షం పడక ముందే విత్తనాలు వేసి నష్టపోవద్దు. ఒక్కరికీ చూసి ఒకరు విత్తనాలు విత్తుకోవద్దు. మంచి వర్షం పడినప్పుడే అన్ని రకాల పంటల విత్తనాలు విత్తుకోవాలి.

నీటి సమస్యను పరిష్కరించాలి

- పల్సి గ్రామస్తులు ఆందోళన



నవతెలంగాణ-కుభీర్

గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా వెంటాడుతున్న అధికారులు మాత్రం గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని పల్సి గ్రామస్తులు నీటి సమస్యను పరిష్కరించడం లేదని, పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. అనంతరం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత కొన్ని రోజుల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అదే విధంగా గ్రామంలో ఉన్న బోర్లు చెడిపోయి, కొన్ని నెలలు గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేయడం లేదని ఆరోపించారు. బోరు బావుల నుంచి తీసిన మోటర్లు గ్రామ పంచాయతీలో ఉంచిన బోర్లు మాయమైపోయాయని, అవి సర్పంచ్ సొంతానికి వాడుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పంచాయతీలో నిధులు లేకపోవడంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయని, నిధులు రాగానే మరమ్మతులు చేపడుతామని కార్యదర్శి తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సీఐ సాయినాథ్

నవతెలంగాణ-బేల



నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సాయినాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండల శాంతి కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండుగని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. పండుగను దృష్టిలో ఉంచుకొని పశువులు అక్రమంగా తరలించకుండా అన్ని చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పశువులకు సంబంధించిన నిజ ధృవీకరణ పత్రాలు స్థానిక పశువైద్యుని వద్ద తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమాచారం ఇవ్వాలి కానీ చట్టాన్ని చేతుల్లో తీసుకోవద్దని అలాంటి వారిపైన కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాధికతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు మరువలేనివి



నవతెలంగాణ-నిర్మల్

రామోజీ రావు సేవలు మరువలేనివని, విశ్వమానవాళిని అక్షరాలతో పాలించిన రాజేంద్రుడు దివంగత రామోజీరావేనని తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయ పాథలాజికల్ ల్యాబరేటరీ కార్యాలయంలో రామోజీరావు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు సంతాపసభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఐదు నిమిషాలు మౌనం పాటించారు. శ్రద్ధాంజలిని ఘటించి, కవితాగానం, కవితాక్షర నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. విశ్వమానవాళి ప్రయోజనాలకోసం ప్రపంచ స్థాయిలో అమూల్యమైన సేవలు అందించారని అన్నారు. తెలుగువారి సామాజిక, రాజకీయ చరిత్రను ప్రభావితం చేసిన అజేయుడని, పద్మ విభూషణ్ పురస్కారం వరకు స్వశక్తితో ఎదిగి, ప్రత్యక్షంగా పరోక్షంగా కొన్ని లక్షల కుటుంబాలకు అన్నదాతై నిలిచిన అసామాన్యుడు రామోజీరావేనని అన్నారు. అంతర్జాతీయ జాతీయ రాష్ట్రీయ ప్రాంతీయ వార్తలను తమ పత్రిక ద్వారా అక్షరానికి ఆయుధమై ప్రజాప్రయోజనాలే పరమావధిగా భావించిన విశ్వమార్గదర్శకుడు అన్నారు. తన న్యూస్ ఛానల్‌తో తెలుగునాట తొలినాళ్లలో 24 గంటల వార్తాస్రవంతికి శ్రీకారం చుట్టిన దృశ్య దార్శనికుడని అన్నారు. పలు భాషల్లోఛానల్లను నడిపించిన నేటి కంప్యూటర్ మేధావియని అన్నారు. వర్తమానాన్ని దాటి చూడగలిగిన దార్శనికుడని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన అక్షరయోధుడని కొనియాడారు. నిత్య ఉషస్సులను ప్రసరించే చల్లని భానుడని, ప్రపంచానికి ప్రియాపచ్చళ్లను రుచిచూపించారని అన్నారు. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా అనేక చిత్రాలను నిర్మించిన భావినిర్మాతయని, నేటి ప్రపంచ కాలానికి అక్షర యోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, డా.ఉప్పు కృష్ణం రాజు, పత్తి శివప్రసాద్, తుమ్మల దేవరావు, పోలీస్ భీమేష్, కామారపు జగదీశ్వర్, శనిగారపు నాగరాజు, నాగారాం, కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు నాణ్యమైన వైద్యం



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోనీ పీహెచ్‌సీలో ఎనిమిది గ్రామాల పరిధిలోని 45 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. రక్తం తక్కువ ఉన్న గర్భిణులకు ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్ ఇచ్చారు. గర్భిణులు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరంలో సీహెచ్‌ఓ లక్ష్మి, హెచ్‌ఇఓ నాందేవ్, పీహెచ్‌ఎన్‌ఓ సుశీల,హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, సతవ్వ వైద్య సిబ్బంది జంగుబాయి, ఆశాలు జ్యోతి, పంచుబాయి, లక్ష్మీ సుగుణ, గుంపుబాయి, నిర్మలబాయి, జిజాబాయి, చిన్నుతాయి ఉన్నారు.

జేఈఈలో సత్తా చాటిన పవార్ చంటి



నవతెలంగాణ-ఇచ్చోడ

ఆల్ ఇండియా జేఈఈలో పవార్ చంటి 422వ ర్యాంకు సాధించి, సత్తా చాటారు. మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థి పవార్ చంటి జేఈఈ ఫలితాల్లో ఆల్ ఇండియా 422 ర్యాంకు సాధించి రికార్డు సృష్టించాడు. సర్ల సాయికృష్ణ 742 ర్యాంకుతో జేఈఈలో సత్తా చాటారు. ఎన్ఐటీలోను ధరావత్ అర్జున్ 78శాతంతో ప్రతిభ కనబరిచారు. ముగ్గురు విద్యార్థులను మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జేఈఈ, ఎన్ఐటిలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులకు గత సంవత్సరం నుంచి జిల్లా కేంద్రంలోని గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో స్టార్-50లో జేఈఈ, ఎన్ఐటీ కోచింగ్ ఇప్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

6.6 కిలోల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-నేరడిగొండ

గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు మంగళవారం పోలీసులు మండలంలోని రోల్‌మామడ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్సులో 6.6కిలోల గంజాయి లభ్యమైంది. ఆ గంజాయి విలువ సుమారు 1.65లక్షలు ఉంటుందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులు హైదరాబాద్‌కు చెందిన వారని తెలిపారు, నిందితుడు హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్ పాపిశెట్టి సంతోష్ కుమార్‌గా గుర్తించారు. సెబుల్ జైత్రం, అమర్ సింగ్, గ్రామం ధర్మసాగర్ ఇంద్రవెల్లికి చెందినవారు వీరిద్దరూ పరారీలో ఉన్నట్టు తెలిపారు. సంతోష్ కుమార్ నిందితుడి నుంచి స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సై మారుతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ చిహ్నంలో అంబేద్కర్ చిత్రాన్ని చేర్చాలి



నవతెలంగాణ-బోథ్

తెలంగాణ చిహ్నంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని చేర్చాలని మంగళవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రంతో పాటు పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, సమ్మక్క, సారలమ్మ చిత్రాలను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు రమేష్, పాలెపు గంగయ్య పోనకంటి జైపాల్, శివ, అఖిల్, విజయ్, అశోక్, పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ మల్లికార్జున్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



డ్వాక్రా గ్రూప్ మహిళలలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని రహపెల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల గ్రూప్ మహిళలు బ్యాంక్ నుండి వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు బ్యాంక్ అందించే రుణాలు తీసుకుని వాటిని సకాలంలో చెల్లించి మళ్ళీ రుణాలు పొందాలన్నారు. అప్పుడే సంఘం బలోపేతం కావడమే కాకుండా రుణ పరిమితి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సత్యనారాయణ, నాయకులు సుంకరి పెంటయ్య, మధుకర్, గణేష్ పాల్గొన్నారు.

సలుగుపల్లిలో గుడుంబాపై అవగాహన

నవతెలంగాణ-బెజ్జూర్



గ్రామాల్లో గుడుంబా, నాటు సారా తయారు చేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామనపి కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి అన్నారు. మంగళవారం మండలంలోని సలుగుపల్లి గ్రామంలో గుడుంబా, గంజాయి, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవి మాట్లాడుతూ పల్లెల్లో నాటు సారా క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నాటు సార తయారు చేసేవారిపై చట్ట పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఎవరైన మత్తు పదార్థలు అమ్మితే తమనకు తెలియజేయాలని, సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్పాహార బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అల్పాహారానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వాహకులతో కలిసి జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అల్పాహారం నిర్వహణలో పని చేస్తున్న వారికి బిల్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిర్యాణి మండలంలో మాత్రం స్కీం మొదలు నుండీ ఇప్పటి వరకు బడి పిల్లలకు అల్పాహారం అందించిన వేతనాలు, బిల్లులు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందనీ అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తిర్యాణి మండల వ్యాప్తంగా అల్పాహారం నిర్వహణ బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ తిర్యాణి మండల అధ్యక్షులు మడావి చంద్రకళ, కోశాధికారి వెడ్మ ఊర్మిళ, సహాయక కార్యదర్శి కుర్సెంగ లక్ష్మీ, జిల్లా నాయకులు బాగుబాయి పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్‌కు సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

లక్ష్మణ్ సేవాసదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలకేంద్రానికి చెందిన దుర్గం అర్జున్ నిరుపేద విద్యార్థి జేఈఈ అడ్వాన్స్ ర్యాంకు సాధించినందుకు శాలువతో సన్మానించారు. పై చదువులకు లక్ష్మణ్ సేవాసదన్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గాదె అవినాష్ రూ.5100 అందజేశారు. శ్రీ సత్యసాయి బాబా సేవా సమితి అధ్యక్షుడు గాదె అనిల్ కుమార్‌తో పాటు సభ్యులు కూడా విరాళాలు అందజేశారు. అర్జున్ తండ్రి కొన్ని నెలల క్రితం మృతిచెందాడని, మండలానికి చెందిన అర్జున్ 1782 ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మౌల్కార్, ప్రధాన కార్యదర్శి దౌలత్‌కుమార్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోషన్, పెంటు, ఇంద్రజిత్, రాజేష్, సచిన్ పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్, బోర్వెల్ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని ఫిల్టర్ బెడ్, బోర్వెల్ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గోలేటి సివిల్ డిపార్ట్‌మెంట్ ఫిట్ కార్యదర్శి గడ్డం రమేష్ కోరారు. మంగళవారం ఈ విషయమైన సివిల్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈకి వినతిపత్రం అందించారు. పంపు ఆపరేటర్ ఉండే స్థలంలో పాములు వస్తున్నాయని, చుట్టూ రౌండ్‌గా పిట్ట గోడ కట్టించాలని, ఫిల్టర్ బెడ్ పంపు షెడ్డు ముందు ఎలక్ట్రికల్ స్టార్టర్స్ కింద వర్షం వచ్చినప్పుడు షాక్ వస్తుందని తెలిపారు. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేల అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.జగ్గయ్య, నాయకులు నాడెం రవి, రాచర్ల రమేష్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా శివమల్లన్న ఆలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామీ దేవాలయం 45వ వార్షికోత్సవాన్ని జేష్ఠ శుద్ధ పంచమి మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితులు ముద్దు నరహరి శర్మ ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ముద్దు అవధూత శర్మ, దినేష్ శర్మ, అనురాగ్ శర్మ, కిషోర్ శర్మల మంత్రోచ్చారణల నడుమ దేవాలయ మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, నవగ్రహ పూజ, మండపారాధన, శివ మల్లన్న స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం అనంతరం శివ మల్లన్న స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక అర్చన, మహా హారతి, మంత్రపుష్పము, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, మహాదాశీర్వచనం తదితర కార్యక్రమములు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ గుప్తా, ఉత్సవ కమిటీ సభ్యురాలు ఎమ్మాజి శారద సంతోష్, దాత చెలిమెల ప్రశాంత్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణ సతీమణి రుక్మిణి దేవి, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందు చూపు లేని విద్యాశాఖ

- నాలుగు చోట్ల పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని వైనం
- మూతపడ్డ మేకలగూడ పాఠశాల
- 14 చోట్ల ఏకోపాధ్యాయులే దిక్కు

నవతెలంగాణ-దహెగాం

ప్రయివేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగిస్తాం.. నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు అందులో మాత్రం ఏమాత్రం చిత్త శుద్ధి కనబర్చడం లేదు. ఫలితంగా ఉపాధ్యాలు లేకుండా పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా కొన్ని చోట్ల పూర్తిగానే పాఠశాలలు మూతపడిపోతున్నాయి. దీంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు తలెత్తడంతో విద్య శాఖ అధికారుల ముందు చూపు లేకపోవడమే నిదర్శనంగా కనిపిస్తోంది. మండల వ్యాప్తంగా 42 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 5 ఉన్న పాఠశాలలున్నాయి. వీటితో పాటు మరో ఆశ్రమోన్నత పాఠశాల, కేజీబీవీ బాలికల విద్యాలయం కూడా ఉంది. వీటన్నంటిలో మొత్తం 1 నుంచి పదవ తరగతి వరకు 3114 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 55 పాఠశాలల్లో 89 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

నాలుగు చోట్ల ఉపాధ్యాయులే లేరు..

మండల వ్యాప్తంగా 55 పాఠశాలలుండగా వీటిలో 14 చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలున్నాయి. మరో నాలుగు చోట్ల ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు లేకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం. గొర్రెగుట్ట ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులుండగా, పాలంపల్లిలో 11 మంది, పానకాల గూడలో 12 మంది ఉండగా ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి. అదే విధంగా మేకలగూడలో సుమారు 8 మంది వరకు విద్యార్థులున్న కూడా పాఠశాలకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో పూర్తిగా మూసివేసిన దుస్థితి నెలకొంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి సుమారు 30 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్నత పాఠశాలల పరిస్థితైతే మరీ ఘోరంగా ఉంది. అసలు ప్రస్తుతం ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఎంత మంది బదిలీ అవుతున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది.

ఊసేలేని విద్యావాలంటీర్ల నియామకం

రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రారంభం కంటే ముందుగానే జూన్ 10 వరకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను విద్యావాలంటీర్ల నియామకంలో భర్తీ చేస్తామని పేర్కొంది. నేటితో విద్య సంవత్సరం ప్రారంభం అవుతున్న కూడా దాని ఊసే తీయడం లేదు. దీంతో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న నిరోద్యగుల ఆశలు గల్లంతు అయ్యాయి. చాలా చోట్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉపాధ్యాయులు లేని పాలంపల్లి పాఠశాల

మన ఊరు మనబడి బిల్లులు చెల్లించాలి

- జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గతంలో చేసిన మన ఊరు మనబడి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని లేదంటే పాఠశాలలకు తాళాలు వేయాల్సిన పరిస్థితి తలెత్తుతుందని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ భవనంలో డిప్యూటీ సీఈఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సంఘాల సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు మనబడి పనులు చేసిన వారికి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని చెల్లించాలన్నారు. జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ బాబు స్పందిస్తూ వాటికి సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదని వివరణ ఇచ్చారు. జిల్లాలోని పలు రహదారులకు టెండర్లు పూర్తయి పనులు ప్రారంభం కాలేదని దానికి కారణమేంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. అధికారం లేకున్నా పదవిలో ఉన్నామని, ప్రజలు తనకు బాధ్యత అప్పగించారని అధికారులు ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆసిఫాబాద్-ఆదిలాబాద్ రహదారిలో అడ కుడి కాలువ బ్రిడ్జి పైన విపరీతమైన గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని పూడ్చాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కాగజ్‌నగర్‌లోని అందవెల్లి బ్రిడ్జి త్వరగా పూర్తిచేయాలని అడగగా పనులు చివరి దశలో ఉన్నాయని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని ఈఈ వివరణ ఇచ్చారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి కాంట్రాక్టర్ వేతనాలు సరైన సమయంలో ఇవ్వడం లేదని చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఈ సమావేశాల్లో డీఆర్డీఓ సురేందర్, సీపీఓ పాపయ్య, వివిధ శాఖల ఈఈలు ప్రభాకర్, గుణవంతురావ్, వెంకటపతి, జిల్లా వైద్యాధికారి తుకారం భట్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, వివిధ మండలాల జడ్పీటీసీలు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం అడ గ్రామపంచాయతీ పరిధిలో గల వాడిగూడ ప్రాథమిక పాఠశాల, ఈదులవాడ ప్రాథమిక పాఠశాల, వాంకిడి మండలంలోని ఘాట్ జంగాం, మండోకర్ వాడ, గోయగాం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండటంతో పాఠశాలల్లో మిగిలిన మరమ్మతుల పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, సానిటేషన్, ఫ్యాన్ల ఏర్పాటువంటి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల గదులు శుభ్రపరచాలని, ఆవరణలో ఉన్న చెత్తను, శిథిలాలను తొలగించాలని సూచించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండటంతో విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులు, పుస్తకాలు వెంటనే వారికి అందించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆర్ఎంపీలతో కలిసి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావులకు వినతిపత్రాలు వేరువేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి పార్టీ తమకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వకపోగా ప్రస్తుతం దీనిపైన ఆధారపడి జీవిస్తున్న తమను ఇబ్బందులు పెట్టే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వైద్యులు అజయ్, లక్ష్మణ్, మధుకర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్, థర్డ్ పార్టీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్ల శ్రమ దోపిడికి గురవుతున్నారని, వీరికి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీరిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, మల్లేష్, మురళీ నీల, మమత, హరీష్, సత్తార్, నవీన్ పాల్గొన్నారు

ఉద్యోగుల ఆసిఫాబాద్ బ్రాంచ్ కమిటీ ఎన్నిక

తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఆసిఫాబాద్ బ్రాంచ్ కమిటీ ఎన్నుకోగా అధ్యక్షుడుగా చిన్నబోయిన శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా సత్తార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వీరికి అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాడాలని సూచించారు.

28న రొమ్ము క్యాన్సర్ వైద్య శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 28న రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 45 సంవత్సరాలు నిండిన మహిళ ఉద్యోగులు, సింగరేణి ఉద్యోగి కుటుంబ సభ్యుల్లో 45 సంవత్సరాలు నిండిన మహిళలకు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చుక్కల దుప్పిని రక్షించిన యువకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు చుక్కల దుప్పిని కుక్కల బారి నుండి కాపాడినట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని మాణిక్ గూడ పరిసర ప్రాంతాల్లో ప్రముఖ వ్యాపారి ఫయాజ్‌కు చెందిన ఫామ్ హౌస్‌లోకి మంగళవారం ఉదయం చుక్కల దుప్పిని కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న ఫయాజ్ కుమారులు హసన్, రహమాన్ కుక్కల బారి నుండి దానిని రక్షించి అటవీ అధికారులకు అప్పగించారు. దీంతో అటవీ అధికారులు ప్రథమ చికిత్స చేసి తిరిగి అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి అప్పలకొండ మాట్లాడుతూ జంతువులను రక్షించే బాధ్యత ప్రజలు కూడా తీసుకున్నప్పుడే వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. రహమాన్ చేసిన పనిని అభినందించారు. పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఇకపై గంటల తరబడి లైన్లలో నిరీక్షించే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా నిమిషాల వ్యవధిలో చెల్లించవచ్చునని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగినట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేసే సౌకర్యాన్ని కల్పించి బిల్లుల చెల్లింపులను టీజీఎన్ పీడీసీఎల్ సులభతరం చేసిందన్నారు. ఈ చెల్లింపులు ప్రతినెల 20 శాతం పెరుగుతున్నాయన్నారు. టీజీఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీఎన్‌పీడీసీఎల్.కామ్ ద్వారా నెల వారి విద్యుత్ బిల్లులు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్ ద్వారా ఇంటినుండే చెల్లింపు చేయవచ్చునని చెప్పారు. టీజీఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా కట్టిన బిల్లుల వివరాలు కూడా తెలుసుకోవచ్చని, రశీదుని కూడా పొందవచ్చని తెలిపారు. ఇప్పటినుండి అందించే బిల్లుపై క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించడం జరుగుతుందని, మొదట ప్రయోగాత్మకంగా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్ పరిధిలో ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో ఆసిఫాబాద్ సర్కిల్లో కూడా ప్రారంభిస్తామన్నారు. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా బిల్లుకు సంబంధించిన వివరాలు, చెల్లించాల్సిన మొత్తం కనపడుతుందని, తద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు.

బర్త్ సర్టిఫికెట్ లేక ఆధార్ రాక విద్యార్థుల ఇబ్బందులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నక్కలగూడ గ్రామంలో సుమారు 35 మంది పిల్లలు బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్ కార్డు పొందలేకపోతున్నారని జడ్పీటీసీ వేముల సంతోష్ అన్నారు. మంగళవారం కుమురం భీం ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. దీనికి ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్టు జడ్పీటీసీ తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ఆధార్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు 15 రోజులలో ఆధార్ కార్డు ఇప్పిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓకు గ్రామస్తులు కృతజ్ఞలు తెలిపారు

నేడు మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సవాతి గ్రామంలో నిర్వహించే ఆదివాసీ సమ్మేళనానికి రాష్ట్ర మంత్రి సీతక్క హాజరవుతున్నట్టు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, దుర్గం ప్రశాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-తాండూర్



కస్తూర్బా విద్యాలయానికి చెందిన దుర్గం మమత ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన సందర్భంగా రాష్ట్ర విద్య శాఖ సంచాలకులు మల్లయ్య భట్టు విద్యార్థిని సన్మానించినట్టు కేజీబీవీ ఎస్ఓ సుమన చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీ రాజీవ్, కేజీబీవీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ హజారి శిరీష విద్యార్థిని సత్కరించి మరింత రాణించాలని ఆకాంక్షించారని తెలిపారు.

మిషన్ భగీరథ సర్వే సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం మండలంలోని 29 గ్రామపంచాయతీలో మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్నారు. ఆ సర్వే సరళిని ఎంపీడీఓ పరిశీలించారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించి అన్ని వివరాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ ఈఓ రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఓలను సవరించి వేతనాలు పెంచాలి

- ఎస్‌సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



నవతెలంగాణ-మందమర్రి

కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీఓలను సవరించి వేతనాలను పెంచాలని ఎస్‌సీకేఎస్(సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జీఎం కార్యాలయం ఎస్‌బీఐ బ్యాంకు మైదానం వద్ద మందమర్రి డివిజన్ కన్వేయన్స్ డ్రైవర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ 2022 సెప్టెంబర్‌లో సింగరేణి యాజమాన్యం చేసిన అగ్రిమెంట్‌లోని మిగిలిన అంశాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీఓలను సవరించి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు తమ వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని 2022 సెప్టెంబర్‌లో 18 రోజులు చేసిన పోరాటంతో యాజమాన్యం దిగివచ్చి లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో 12 డిమాండ్ల పై ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. కానీ 2 సంవత్సరాలు కావస్తున్న ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఒప్పందంలోని అంశాలను అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. బోనస్ 20శాతానికి సంబంధించి, పని ఆధారంగా అన్ స్కిల్డ్ కార్మికులను సెమీ స్కిల్డ్‌గా, సెమీ స్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించడం, పండగా, ఆర్జిత సెలవులకు, నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని నిరసనలు, ధర్నాలు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 జూన్‌లో విడుదల చేసిన కనీస వేతనాల జీఓలను కూడా అమలు చేయకుండా వాటి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జీఓలను తీసుకువచ్చి ఉన్న వేతనాలనే మరింత తగ్గించే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఈ అంశంపై కార్మికులు, యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్‌కి వ్యక్తిగత దరఖాస్తులను ఇచ్చినట్టు తెలిపారు. సంబంధిత అధికారులు ప్రభుత్వంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కన్వేయన్స్ డ్రైవర్లకు సీఎంపీఎఫ్ అమలును వేగవంతం చేసి డ్రైవర్లందరికీ సీఎంపీఎఫ్ నెంబర్లను ఇవ్వాలని, ఓనర్ల నుండి 15శాతం కట్ చేశారో ఆ డబ్బులను కార్మికుల అకౌంట్‌లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్ యూనియన్(సీఐటీయూ) డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కె తిరుపతి, యు.రవి, ఎండీ చాంద్ పాషా, కృష్ణ, రమేష్, ఓదెలు, వై శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా ప్రతిభ అవార్డ్

నవతెలంగాణ-జన్నారం



పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రాథోడ్ ఈశ్వర్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నాడు. వందే మాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి రాథోడ్ ఈశ్వర్ పాల్గొని అవార్డు అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం గుండ రాజన్న తెలిపారు. 10 జీపీఏ సాదించినందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, విద్యార్థి తండ్రి సంజీవ్ కుమార్‌లను సత్కరించారు. ముఖాముఖి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ పాల్గొన్నారు. కాగా ప్రతిభ అవార్డు పొందిన రాథోడ్ ఈశ్వర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, మండల తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎన్.విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, హెచ్ఎం కట్ట రాజమౌళి అభినందించారు.

సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఉన్నత పాఠశాల కళ్యాణిఖనిలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్, హెచ్ఎం పురుషోత్తం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సింగరేణి ఉన్నత పాఠశాల కళ్యాణిఖనిలో ప్రవేశాలకు 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో 200 సీట్లు ఖాళీలున్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాల వారు జూన్ 12 నుండి జూలై 31వ తేదీలోపు ప్రవేశాలు పొందాలన్నారు. బస్సు సౌకర్యం, ప్రతిభావంతులైన టీచింగ్ ఫ్యాకల్టీ ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో మధ్యాహ్న భోజన సౌకర్యం, ఉచిత పుస్తకాలు, మినరల్ వాటర్ సదుపాయం ఉందన్నారు.

అటవీ ఆంక్షలుఎత్తివేయాలని నిరసన

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ అభయారణ్యంలో అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం పట్టణానికి చెందిన సామాజికవేత్త భూమాచారి నిరసన వ్యక్తం చేశారు. అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ ఆయన మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై మెడలో ఫ్లెక్సీని పెట్టుకొని నిరసన తెలిపారు. ఆంక్షలను ఎత్తివేసే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఆంక్షలతో భారీ వాహనాలు రాక తీవ్రంగా నష్టపోతున్నామని భూమాచారి ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ఆంక్షలు ఎత్తివేయకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సేంద్రియ వ్యవసాయంపై శాస్త్రవేత్తలతో ముఖాముఖి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి చర్చ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదికలో వీసీ ద్వారా రైతులకు విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత పత్తి పంట సాగు విధానం, సేంద్రియ వ్యవసాయంపై రైతుల అనుభవాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించి సూచనలు చేశారు. శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సేంద్రియ వ్యవసాయంతో లాభాలు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో అంజిత్ కుమార్, సంగీత, కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



నవతెలంగాణ-జన్నారం

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని మండలంలోని తపాలపురం జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ అన్నారు. మంగళవారం తపాలపూర్ గ్రామపంచాయతీలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలన్నారు. వారికి మధ్యాహ్న భోజనం రెండు జతల దుస్తులు ఉచిత పుస్తకాల అందిస్తామన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి, కార్యదర్శి, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న మేకల మార్కెట్, తైబజార్ బహిరంగ వేలం

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తీగలపహాడ్ యాదవనగర్‌లోని మేకల మార్కెట్, సంతలు, రోడ్ల వెంట వ్యాపారం చేసే వారి నుండి తైబజార్ రుసుం వసూలుకు సంబందించిన బహిరంగ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బుధవారం ఉదయం 11 గంటల నుండి నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 13 నుండి 15 వరకు రూ.50 వేలు కమిషనర్ నస్పూర్ మున్సిపాలిటీ పేరున బ్యాంక్ ద్వార డిమాండ్ డ్రాఫ్టులు తీసుకొని కార్యాలయ పని వేళలలో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఐటీఐలో మొదటి దఫా అడ్మిషన్ దరఖాస్తుల గడువు పొడిగించినట్లు జన్నారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్‌లో శిక్షణ పొందడానికి మొదటి దఫా సీట్లకు జూన్ 14 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఐటీఐ.తెలంగాణ.జీవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో, కుల ధృవీకరణ, బోనఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, టీసీ, ఎంప్లాయిమెంట్, ఆధార్ సెల్ నెంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐఎన్టీయూసీ ఒత్తిడితోనే వయోపరిమితి పెంపు

నవతెలంగాణ-మందమర్రి

ఐఎన్టీయూసీ ఒత్తిడితోనే పెండింగ్‌లో ఉన్న వయోపరిమితి పెంపు సాధ్యమైందని సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపల్లి సమ్మయ్య తెలిపారు. మంగళవారం సంఘ కార్యాలయంలో యూనియన్ నాయకులతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ ఉద్యోగాల గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40సంవత్సరాలకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సంఘం సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ యాజమాన్యంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో పెండింగ్‌లో ఉన్న వయోపరిమితి పెంపు ఉత్తర్వులు వచ్చాయన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే యూనియన్ కేవలం ఐఎన్టీయూసీయేనని మరోసారి రుజువైందన్నారు. కార్యక్రమంలో పుల్లూరి లక్ష్మణ్ కాంగ్రెస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్, దేవి భూమయ్య, సంఘం ఏరియా వైస్ ప్రెసిడెంట్ దోవిశెట్టి చంద్రశేఖర్, ఏరియా సెక్రటరీ కరుకూరి తిరుపతి పాల్గొన్నారు.



అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్
- లక్కీడ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటు ఉన్నతంగా రాణించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత గల షెడ్యూల్డ్ కులముల విద్యార్థినీ, విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి చేపట్టారు. అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా ద్వారా విద్యార్థులకు పాఠశాలలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో 1, 5 తరగతులలో ప్రవేశం కోసం విద్యార్థినీ, విద్యార్థులకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశానికి 154 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా లక్కీడ్రా పద్ధతిన సజావుగా 92 మందిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో బాలికల విభాగంలో 30 మంది బాలికలు, జనరల్ విభాగంలో 61 మంది బాలబాలికలు, అనాథ విభాగంలో 1 ఎంపిక చేయడం జరిగిందన్నారు. 5వ తరగతిలో 160 మంది దరఖాస్తు చేసుకోగా 91 మందిని ఎంపిక చేశామన్నారు. బాలికల విభాగంలో 29 మంది, జనరల్ విభాగంలో 61 మంది, అనాథ విభాగంలో 1 ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థానాలలో నిలిచేలా క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషి ఫలితమే వయోపరిమితి పెంపు

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కృషి ఫలితంగా డిపెండెంట్ ఉద్యోగస్తుల వయోపరిమితి 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంపుదలకు సంబంధించిన సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా అన్నారు. మంగళవారం ఆర్కే5 గనిపై కార్మికులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా పని చేస్తున్నామని, ఆనాడు సింగరేణి డిపెండెంట్ ఉద్యోగస్తుల పిల్లలకు వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికుల విన్నపం మేరకు గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి పలు దఫాలుగా తీసుకువెళ్లడంతోనే సర్క్యులర్ జారీ అయిందన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు అయ్యే దిశగా సాగుతామన్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు విజయ్, శంకర్రావు, విశ్వనాథ్ రెడ్డి, రాజయ్య, సంపత్, కొట్టే శ్రీకాంత్, సంజీవరెడ్డి, మధు, రమేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల గరిష్ట వయోపరిమితి పెంపు

- లబ్ధిపొందనున్న 300 మంది నిరుద్యోగులు
- 2018 మార్చి నుండి వర్తింపు : సింగరేణి సీఎండీ బలరామ్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కారుణ్య ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని 35 నుండి 40 సంవత్సరాలకు సింగరేణి యాజమాన్యం పెంచింది. గతంలో చూస్తే 18 నుండి 35 సంవత్సరాలలోపు వారు మాత్రమే కారుణ్య నియామకాలకు అర్హులు కాగా ఇప్పుడు 40 సంవత్సరాల వయస్సున్న వారు కూడా ధరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సింగరేణి యాజమాన్యం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో సింగరేణి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ వెల్లడించారు. వయో పరిమితి వల్ల వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోయవడంతో పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ఇటీవల హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో 441 మందికి బదిలీ ఫిల్లర్ల నియామక పత్రాలు పంపిణీ చేసిన సమయంలో సీఎం, డిప్యూటీ సీఎం వయో పరిమితి పెంపుపై సూచన చేసినట్లు సీఎండీ పేర్కొన్నారు. అయితే సింగరేణి బోర్డు డైరెక్టర్లతో సమావేశమై చర్చించి వయో పరిమితి పెంపు నిర్ణయం తీసుకున్నారు. 2018 మార్చి 9 నుండి వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. వయోపరిమితి పెంపు ద్వార ప్రస్తుతం 300 మందికి లబ్ధి చేకూరనుండగా రానున్న రోజుల్లో మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని సంస్థ వెల్లడించింది. కాగా సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఎవరైనా చనిపోయిన, అనారోగ్యంతో బాధపడుతూ అనర్హులుగా మెడికల్ బోర్డు ప్రకటించిన సంధర్భంలో కారుణ్య నియామకానికి అర్హులుగా పరిగణలోకి తీసుకుంటారు.

అర్హులైన వారికి వెంటనే ఉద్యోగం

సవరించిన ఉత్తర్వుల మేరకు 40 సంవత్సరాల వయస్సున్న అర్హులైన వారందరికి వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని సీఎండీ బలరామ్ తెలిపారు. 2018 మార్చి 9 నుండి అమల్లోకి వస్తున్నందున కారుణ్య నియామకాలకు అర్హులైన వారు సంబంధిత ఏరియాల్లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉద్యోగానికి బదులుగా ఏక మొత్తం సొమ్ము తీసుకున్న వారు, అర్హులైన వేరే వారసునికి ఉద్యోగం పొందిన వారు ఈ కొత్త సవరణ ప్రకారం ఉద్యోగం పొందే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పాత గరిష్ట వయో పరిమితి నిబంధన ప్రకారం ఉద్యోగం పొందలేని, ఎటువంటి సెటిల్మెట్ జరుగని కేసులకు మాత్రమే సవరింపు స్కీం అమలవుతుందని తెలిపారు.



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం (ఫైల్)

వయో పరిమితి పెంపుతో హర్షం

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గరిష్ట వయోపరిమితి పెంపుపై సీఎం సానుకూలంగా స్పందించి సింగరేణి యాజమాన్యం ద్వార ఉత్తర్వులు జారీ చేయించడం పట్ల సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలనలో కూడా అనేక మంది ఈ విషయమై ధరఖాస్తు పెట్టుకోగా తమ విజ్ఞప్తుల పట్ల స్పందించిన ప్రభుత్వానికి ధర్యవాదాలు తెలుతున్నారు. కాగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు కూడా వయోపరిమితి పెంపు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సామాజిక సేవలు చేసి బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి భాఫూలే అవార్డు పొందిన జిల్లాకు చెందిన ఆవిడపు ప్రణయ్‌ని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదాం నాగరాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో మహాత్మ జ్యోతి భాఫూలె సావిత్రి బాయి ఫూలే ఆలోచన విధానంతో విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్నారన్నారు. అవార్డుతో జిల్లాకు పేరు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో హిందు వాహిని కార్యకర్తలు సిరికొండ కృష్ణ, పిప్పిరి సాయి, తరుణ్, జస్వంత్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-వాంకిడి



పాఠశాలలు బుధవారం నుంచి పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేస్తున్నమని ఎంఈఓ మణికుమార్ తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ కార్యాలయానికి వచ్చి సంబంధిత పాఠశాలల పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లాలని ఆయన సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గావ్ గ్రామానికి చెందిన ఆనక సంతోష్ స్వప్న పిడుగు పాటుకు పొలంలో మృతి చెందారు. వారికి ఒక పాప ఉండటంతో మంగళవారం మండల ఆదివాసీ నాయకులు వారి స్వగ్రామంలో మృతుడు సంతోష్ కుటుంబాన్ని పరామర్శించారు. వివిధ ఆదివాసీ గ్రామాలు రెండు రోజుల నుంచి ఆర్థిక సాయంగా రూ.1.13లక్షలు, మెస్రం వంశస్తుల రూ.11వేలు, డొంగర్ గావ్ గ్రామ యువత నుంచి రూ.3 వేల 261 మొత్తం కలిపి రూ.1లక్ష 27 వేల 221ని జమ చేశారు. ఇందులో రూ.12 వేలు ఆర్థిక సాయంగా అందించి, మిగితా రూ.1లక్ష 15 వేల 221ని చిన్నారి పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఆదివాసీ నాయకులు మెస్రం శేఖర్‌బాబు, నాగోబా దేవస్థానం పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్, మెస్రం లింగు, తొడసం నాగోరావ్, యుర్వేత రూపదేవ్, పెందోర్ దీపక్, మెస్రం నాగనాథ్, ఆత్రం జాలింషావ్, ఆత్రం పరమేశ్వర్, పెందోర్ గణేష్, పెందోర్ సంతోష్, జూగ్నక మానిక్ రావ్, మరప్ప గంగారాం ఉన్నారు.

15 నుంచి సదరం వైద్య శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వికలాంగుల కోసం ఈ నెలలో సదరం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరానికి హాజరవడానికి ముందు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో (పీహెచ్‌సీ)లలో వికలంగత్వ పరీక్ష చేయించుకొని, స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 15న మూగ చెవిటి, మానసిక వైకల్యం, 18న కంటిచూపు, 25న ఎముకల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

రిజిస్టర్‌లో సంతకం.. విధులకు డుమ్మా

- గాడి తప్పిన మండల పరిషత్ పాలన
- చర్యలకు జిల్లా అధికారుల ఆదేశాలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాజకీయ నాయకుల, జిల్లా ఉన్నత అధికారుల అండతో కొందరు అధికారులు కొందరు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. విధులకు రాకుండానే వచ్చినట్లు డ్యూటీ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిన స్వంత పనులు చేసుకుంటున్న వైనం కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండల్ పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రస్తుత సూపరింటెండెంట్ మాజీ ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాను ప్రకాష్ విధులకు రాకుండానే డ్యూటీ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూర్ సూపరింటెండెంట్ భాను ప్రకాష్ మే నెలలో 16 వరకు ఎన్నికల విధుల్లో భాగంగా పని చేశారు. 17న విధులకు హాజరై, ఆరోగ్యం బాగాలేదని చెప్పి మే మాసంలోని 18 నుంచి 21 వరకు సెలవు పెట్టారు. దీనికి ప్రస్తుత ఎంపీడీఓ భారతి అనుమతి ఇచ్చారు. కాగా బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయానికి నవతెలంగాణ వెళ్లగా అక్కడ సూపరింటెండెంట్ లేక పోవడంతో అక్కడ ఉన్న సిబ్బంది సూపర్ డెంట్ రాలేదని వివరణ ఇచ్చారు. మే మాసంలో 23న ప్రస్తుత ఎంపీడీవో సెలవుపై వెళ్లగా ఇన్ ఛార్జ్ ఎంపీడీఓ బాను ప్రకాష్ విధులు నిర్వహించారు. దీనితో సెలవు పెట్టిన చిట్టి చూపి 18 నుంచి 22 వరకు సంతకాలు పెట్టారు.

విధులకు డుమ్మా కొట్టి డ్యూటీ లో ఉన్నట్లు గా డ్యూటీ రిజిష్టర్ లో సంతకాలు పెట్టడంతో స్థానికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పని చేయకుండా సంతకాలు పెట్టి, విధులకు డుమ్మకొట్టే అధికారులతో మండలంలో మండల పాలన, గ్రామ పంచాయతీ పాలన గాడి తప్పుడంతో ప్రజలకు సేవలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పని చేసే చోటనే తోటి ఉద్యోగుల పట్ల వ్యవహరించిన తీరు తోటి ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక బాధ్యత గల అధికారి ఇంత పెద్ద కార్యాలయానికి పెద్ద అధికారి సెలవు పెట్టి విధులకు రాకుండానే డ్యూటీ రిజిస్టర్ లో సంతకాలు పెట్టడం ఏమిటని పలువురు ఉన్నత అధికారులకు ప్రశ్నిస్తున్నారు. జిల్లా సిఈఓ చందర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా బీర్కుర్ ఎంపీడీవోకు వివరణ ఇవ్వాలని ఆదేశించామన్నారు.

విధులకు డుమ్మా కొట్టిన అధికారి పై చర్యలు

మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండ్ భాను ప్రకాష్‌కు మే నెలలో 18 నుంచి 21 వరకు సెలవు మంజూరు అయిందని, అయినా సంతకాలు చేయడం పట్ల మెమో ఇచ్చినట్టు ఎంపీడీఓ భారతి వివరణ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్టు తెలిపారు.

బిచ్కుంద నూతన ఏడిఏగా లక్ష్మీప్రసన్న

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏడిఏగా లక్ష్మీ ప్రసన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఇప్పటివరకు టెక్నికల్ ఏడీఏగా విధులు నిర్వహించారు. ఎడిఏ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయించరాదని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతామన్నారు. రైతులు విత్తనాలు, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ కొనుగోలు చేసినప్పుడు తప్పక రసీదు ఇవ్వాలని ఫర్టిలైజర్స్ ఏంఆర్పి ధరలకే విక్రయించాలని ఫర్టిలైజర్ బస్తాలను షార్ట్ ఏజ్ నేపంతో ఎక్కువ ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తే నకిలీ విత్తనాలు అమ్మిన దుకాణ యజమానులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు ఎమ్మెల్యే పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయనున్నట్టు బోధన్ ఎంఈఓ నాగనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి పిల్లలకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఇచ్చోడ



ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని జామిడి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హజరై, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి బడిబాట కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే ఉద్యేశంతో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో భరోసా కలిగిందన్నారు. టీచర్స్, కమిటీ సభ్యులు కలిసి ఇంటింటికి తిరిగి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. మౌలిక సదుపాయాల పనులన్ని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులకే బాధ్యత అప్పగించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని అన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలకు పంపే పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని, పిల్లలు బడికి ఎక్కువ రోజులు సెలవు పెడితే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని అన్నారు. పిల్లలకు అన్నిటికంటే ముఖ్యమైనది చదువేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ పనేందర్‌రావు, ఎంపీఓ సాయిప్రసాద్, ప్రధానోపాధ్యాయులు బాపురావు, ఉపాధ్యాయులు పుట్ట శేఖర్, తహసీల్దార్ తుకారాం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల ఫీజు దోపిడీ అరికట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో స్టేషనరీ పాఠ్యపుస్తకాలు అమ్మకాలను ఆపాలని, అధిక ఫీజుల దోపిడిని నివారించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రణ లేకుండా పోయిందన్నారు. విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తూ తల్లితండ్రులను విపరీతంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలలో ఫీజుల నియంత్రణ కమిటీ వేయకుండా తల్లితండ్రులతో పెంచే ఫీజులపై చర్చించకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు వాళ్ళ ఇష్టానుసారంగా పెంచుతూ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి విద్య సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు హరిశ్చంద్రప్రసాద్, విలాస్ పాల్గొన్నారు.

నానో సీడర్ ద్వారా పొలంలో విత్తనాలు

నవతెలంగాణ-లోకేశ్వరం



పత్తి సాగులో రైతులను కూలీల కొరత వేధిస్తోంది. దీనిని అధిగమించేందుకు అన్నదాతలు యంత్రాలపై ఆధారపడుతున్నారు. మండలంలోని రాజుర గ్రామానికి చెందిన లోలం శ్రీకాంత్ రైతు నానో సీడర్ ద్వారా ఇలా పత్తి విత్తనాలు వేశాడు. ఎలాంటి ఇందన ఖర్చు లేకుండా రోజుకు ఒక కూలీతో ఆరు ఎకరాల వరకు విత్తుకోవచ్చుని రైతు తెలిపాడు.

పలు వివరాలు రైతును అడగగా..

దీని ద్వారా మొక్కజొన్న పంటను కూడా విత్తుకోవచ్చని తెలిపారు. ఈ పరికరంతో మనకు నేలలో విత్తనాలను మనకు కావల్సినంత దగ్గర, దూరం సెట్ చేసుకోవచ్చని తెలిపారు. అవసరం ఉన్న రైతులకు ఒక పత్తి బ్యాగుకు రూ.300 అద్దెకు ఇస్తున్నానని తెలిపారు. మార్కెట్‌లో ఈ యంత్రాన్ని రూ.6వేలకు కొనుగోలు చేసినట్టు తెలిపారు.

20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



నవతెలంగాణ-ముధోల్

20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బాసర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేషనల్ డివార్మింగ్ డే రోజున అందజేసే మాత్రల గురించి పలు సూచనలు అందజేశారు. 1-2 సంవత్సరంలోపు పిల్లలకు, 3-19 సంవత్సరాలు ఉండే వారికి అందజేసే మాత్రల వివరాలను తెలియజేశారు. 20న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలలో పిల్లలకు ఈ మాత్రలను విధిగా అందజేయాలని పేర్కొన్నారు. మాత్రలు అందని పిల్లలకు 27న ఇంటింటికి వెళ్లి అందజేయాలని పేర్కొన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడంతో పాటు శారీరక, మానసిక అభివృద్ధికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీమతి, సూపర్వైజర్లు సరోజని, శారద, శ్రీలక్ష్మి అనిత, మీనా, ఉమా, హెల్త్ సూపర్వైజర్ దత్తురాం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సోలమన్‌రాజ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంధం వినయ్‌సాయి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రైల్వే గేటు మరమ్మతులు

- మూడు రోజుల పాటు రాకపోకల నిలిపివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద ఉన్న రైల్వే పట్టాలకు సంబంధించి ఎస్సీ 30 గేటు మరమ్మతు పనులను ప్రారంభించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ట్రాక్‌పై అత్యవసర పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆ రూట్లో రాకపోకలను పూర్తిగా రైల్వే అధికారులు మూసి వేశారు. నాందేడ్ ఎస్-ఎస్ఈ నరేష్ అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాందేడ్ ఎస్ఎస్ఈ నరేష్ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగానే పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. తాంసి బస్టాండ్ సమీపంలోని ట్రాక్ మరమ్మత్తుల పనుల కారణంగా గేటును మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఈనెల పదో తేది నుంచి 13వ తేది వరకు ఈ రూట్ బంద్ ఉంటుందని తెలిపారు. వీలైంత త్వరగా పనులు పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ రూట్లలో వెళ్లే ప్రయాణికులు సహకరించాలని కోరారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు ఇర్షద్ అలి తన జన్మదినం సందర్భంగా మంగళవారం బోథ్ పట్టణానికి చెందిన పోతాగౌడ్ కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్నాడు. గతంలో పోతాగౌడ్ మృతి చెందగా, భార్య ఉబకాయం వ్యాధితో బాధపడుతున్నారు. కనీసం ఇంటి పనులు చేసే స్థితిలో లేనందున ఇర్షద్ అలి ఆ కుటుంబానికి తన జన్మదినం సందర్భంగా రూ.4 వేలు ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా ఇంటిపై కప్పుకోవటానికి టార్పాలిన్ అందించారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నల్లాను యాప్‌లో నమోదు చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రతి గ్రామంలో ఇంటి నల్లాను యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని జామిడి గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలను ఫోన్‌లో చూశారు. ఇప్పటి వరకు ఎన్ని ఇండ్లు పూర్తయ్యాయని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డీఎల్పీఓ పనేందర్ రావు, ఎంపీఓ సాయిప్రసాద్, కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఉన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు గడువును 14 వరకు పొడిగించినట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థులు ఐటిఐలో ప్రవేశాల కోసం గడువుని పొడిగించినందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థకు చేరిన భవనం కూల్చేయండి

నవతెలంగాణ-లింగంపేట్

వర్షాకాలం సమీపిస్తుండడంతో శిథిలా వ్యవస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని వెంటనే కూల్చివేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం లింగంపేట మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో గల ఉన్నత పాఠశాలను సందర్శించారు. నేటి నుంచి విద్య సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలో నెలకొన్నటువంటి ప్రధాన సమస్యలను తరగతి గదులను ఆయన పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలు క్రితం పాఠశాల భవనం నిర్మాణం చేపట్టిన ప్రస్తుతం శిథిలావ్యవస్థకు చేరుకొని నిరుపయోగంగా ఉండడంతో వెంటనే కూల్చివేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పాటించాలని ఆయన అన్నారు. పాఠశాలలో 163 విద్యార్థిని విద్యార్థులు విద్యార్జనం చేస్తున్నప్పటికిని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది అవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన అదనపు గదుల నిర్మాణ కొరకు వెంటనే ప్రతిపాదనలను పంపించాలని ఎమ్మెల్యే నిధులతో నిర్మాణం చేపడతామన్నారు. అదేవిధంగా పాఠశాలకు చుట్టు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఎన్ఆర్ఈజీఎస నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆయన సూచించారు. నాలుగు గదులలో పెచ్చూలూడిపోవడంతో రెండు గదులు స్లాబ్ ను తొలగించాలని సూచించారు. మరో రెండు గదులు పై కప్పులపై షీట్ వేయాలన్నారు. గ్రామంలో పాఠశాల సమీపంలో స్మశానవాటికలు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామ ప్రజలు కలెక్షన్ వెంటనే సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో స్మశాన వాటికలో ఏర్పాటు చేసుకోవాలని అక్కడికి మార్చాలని ఆయన సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కోసం మరమ్మత్తులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పనులు పూర్తవుతున్నాయన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ డిఇ వెంకటేశ్వర్లు మండల విద్యాధికారి రామస్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషయ్య, ఇరిగేషన్ ఏఈ కన్నయ్య, మాజీ ఎంపీపీ మోహిత, ఎంపిటిసి సాయి కిరణ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

డిష్యూం డిష్యూంపై ఆరా

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గం 'డిష్యూం డిష్యూంపై' నవతెలంగాణలో ప్రచురితమైన కథనం పట్ల ఇంటలీజెన్స్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. సొసైటీ బాడీ మీటింగ్ తర్వాత ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ పర్మిట్ రూమ్‌లో దావత్ చేసుకోగా చైర్మన్‌తో పాటు ఇద్దరు డైరెక్టర్లు బాహాబాహీకి దిగిన ఘటనపై నిజామాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సొసైటీ డైరెక్టర్ల మధ్య బాహాబాహీకి రాజకీయ కారణాల.. లేదా సొసైటీలో లావాదేవీల విషయం ఏమైనా ఉండవచ్చా మరి ఏదైనా కారణం కావచ్చా అని ఆరా తీస్తున్నారు. దీంతో సొసైటీ పాలకవర్గ సిబ్బందిలో ఆందోళన మొదలైంది. స్థానికంగా ఈ విషయం ఎంతో చర్చనీయాంశ అవుతుండగా.. రాజకీయ అంశంగా మారింది.